క్లుప్తంగా

నేడు చినదొడ్డిగల్లులో సత్తమ్మ తల్లి పండగ



నక్కపల్లి : మండలంలో ప్రసిద్ధి గాంచిన చినదొడ్డిగల్లు సత్తమ్మ తల్లి పండగ గురువారం ఘనంగా జరగనుంది. గ్రామానికి చెందిన చింతలపాటి కుటుంబీకులు ప్రతి ఏటా ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి అనంతరం వచ్చే గురువారం నాడు సత్తమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహిస్తారు. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద పండగ ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు చినదొడ్డిగల్లు చుట్టుపక్కల గ్రామాలతో పాటు, తుని, పాయకరావుపేట, నక్కపల్లి , అడ్డురోడ్డు ప్రాంతాల నుంచి వందలాది మంది తరలి వస్తారు. ఆలయం వద్ద మొక్కుబడులు చెల్లించుకుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. గ్రామానికి చెందిన గొంప నాగేంద్రబాబు, కీర్తి సౌజన్య దంపతులు ఆలయ నిర్మాణానికి రూ.లక్షా నూట పదహార్లు విరాళంగా బుధవారం అందజేశారు. సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు, కమిటీ సభ్యులు కాశీరావు, భీశెట్టి నాగేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలసొసైటీలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల గెలుపు

ఎస్.రాయవరం : భీమవరం విశాఖ డెయిరీ పాల సొసైటీలో బుధవారం నిర్వహించిన డైరెక్టర్ల ఎన్నికల్లో నలుగురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎన్నికయ్యారు. నాలుగు డైరెక్టర్ల స్థానాలకు బుధవారం ఎన్నిక జరగగా అతికంశెట్టి సీతారాం, గుడాల సూరిబాబు, పోలినాట సూరిబాబు, మడగల బండియ్య ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియలో 150 మంది సభ్యులు ఉండగా 121 మంది మద్దతు తెలిపారు. వారిని గ్రామ సర్పంచ్ గరగా నూకరాజు, డైరెక్టర్లు గరగా శ్రీను, ఉగ్గిన సన్యాసినాయుడు, లింగంపల్లి కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకునికి పీహెచ్‌డీ



పీహెచ్‌డీ సాధించిన శ్రీమన్నారాయణ

నక్కపల్లి : స్థానిక డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న కోలా శ్రీమన్నారాయణకు గీతం విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ (పీహెచ్‌డీ) ప్రదానం చేశారు. ప్రొఫెసర్ జి.వి.స్వామి, ప్రొ.కె.వి రమేష్‌ల పర్యవేక్షణలో శ్రీమన్నారాయణ మెటీరియల్ సైన్స్‌లో బేరియం, కాల్షియం, జిర్కోనియం టైటనేట్‌లో స్టాన్షియం ఆక్సైడ్, సీరియం ఆక్సైడ్ ప్రతిక్షేపణల వల్ల స్ట్రక్చరల్ , డైఎలక్ట్రిక్ , ఇంపిడెన్స్ ధర్మాలతో కలిగే మార్పులపై పరిశోధనలు చేసినందుకు డాక్టరేట్ డిగ్రీని ప్రకటించినట్టు శ్రీమన్నారాయణ తెలిపారు. పీహెచ్‌డీ పట్టా సాధించిన ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య, సహచర అధ్యాపకులు అభినందించారు.

బకాయి జీతాల కోసం కొనసాగుతున్న దీక్షలు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసిన మత్తు వ్యవస విముక్తి విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ బకాయి జీతాలు చెల్లించాలని ఆస్పత్రి వద్ద రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 12 నెలల పాటు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 25 డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ల పర్యవేక్షణ, బాధ్యతను రాష్ట్రప్రభుత్వం తీసుకోవాలని కోరారు. జీతాలు చెల్లించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ దీక్షల్లో ఉద్యోగులు ఎస్.క్రాంతి కుమార్, బి.నాయుడుబాబు, జి.కీర్తన, జి.రాజ్యలక్ష్మి, ఎల్.శ్రీదేవి, చంద్రశేఖర్, ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టుదల ఉంటే పేదరికం అడ్డురాదని ఓ బాలిక నిరూపించింది. రాజుపేటకు చెందిన యల్లపు రిషిత కోటవురట్లలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గత ఏడాది పదోతరగతి చదివింది. పదోతరగతి పరీక్షా ఫలితాలలో 572 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఇటీవల ఆర్జీయూకేటీలో 2024-25 విద్యా సంవత్సరానికి ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు విద్యార్థుల జాబితా విడుదల చేయగా మండలం నుంచి ఒకే ఒక్కరు యల్లపు రిషితకు అవకాశం దక్కింది. ఆమె తండ్రి యల్లపు వీరునాయుడు చిన్న పాన్‌షాప్ నిర్వహిస్తుండగా రిషితకు ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళంలో అవకాశం దక్కడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రిషిత మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా తనకంటూ మంచి గుర్తింపును పొంది పెద్ద కంపెనీలో జాబ్ చేయాలని ఆశిస్తున్నట్టు తెలిపింది.

-యల్లపు రిషిత, కోటవురట్ల



మునగపాక గ్రామానికి చెందిన టెక్కలి శ్రీనివాసరావు , సంతోషి దంపతులు వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి కుమార్తె టెక్కలి జయశ్రీ మునగపాక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతిలో 600 మార్కులకు గాను 569 మార్కులు సాధించింది. మార్కుల ఆధారంగా జయశ్రీ నూజివీడులోని ఐఐఐటీకి ఎంపికైంది.తనకు గ్రూపు-1 ఆఫీసర్ కావాలని ఆశయంగా పెట్టుకున్న జయశ్రీ తన తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారం తాను ట్రిపుల్‌ఐటీలో సీటు పొందడానికి దోహదపడిందని ఆనందం వ్యక్తం చేస్తోంది.

-టెక్కలి జయశ్రీ, నూజివీడు క్యాంపస్



మునగపాకకు చెందిన విల్లూరి వెంకటప్పారావు, పావని దంపతులకు ఇద్దరు కుమార్తెలు, వారిలో విల్లూరి యామిని ఇటీవల టెన్త్ 600 మార్కులకు గాను 570 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు వ్యవసాయం సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మొదటి నుంచి చదువులో రాణిస్తున్న యామిని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఐఐఐటీకి ఎంపికైంది. యామిని నూజివీడు ఐఐఐటీకి ఎంపికకావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనే కోరిక ఉందని కష్టపడి చదువుకొని లక్ష్యాన్ని చేరుకుంటానని చెబుతోంది.

-విల్లూరి యామిని, నూజివీడు క్యాంపస్



మునగపాకకు చెందిన భీశెట్టి సూరప్పారావు, జయ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారిలో గీత ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. 600 మార్కులకు గాను 570 మార్కులు సాధించారు. తల్లిదండ్రులు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. తాము పేదరికంలో ఉన్నా పిల్లలను ప్రయోజకులుగా చేయాలని ఆశించారు. దీంతో గీత శ్రీకాకుళం ఐఐఐటీకి ఎంపికైంది.సాఫ్ట్‌వేర్ జాబ్ సాధించి చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సేవలందిస్తానని తెలిపింది.

-భీశెట్టి గీత, శ్రీకాకుళం క్యాంపస్

పేదింటి కుసుమాలు... ట్రిపుల్‌ఐటీ మాణిక్యాలు

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ట్రిపుల్‌ఐటీ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ)లు ఎంతోమంది విద్యార్థులను భావి భారత ఇంజినీర్లుగా తీర్చి దిద్దుతున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి , ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివి అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభ చూపించిన విద్యార్థులకు ఈ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది నియోజకవర్గానికి చెందిన పలువురు పేద విద్యార్థులు టెన్త్‌లో అత్యధిక ప్రతిభ చూపి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పేద, మధ్యతరగతి, వ్యవసాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి వేసిన వేసిన బాటలు తమకు వరంగా మారాయని వారంతా ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఫలిస్తున్న రాజన్న ఆశయాలు
- పేద విద్యార్థులకు వరంలా మహానేత స్థాపించిన ట్రిపుల్‌ఐటీలు
- సర్కారు బడుల నుంచి భావి ఇంజినీర్లు

నక్కపల్లి : ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులు ఉచితంగా అందించేందుకు మహానేత ఒక మంచి ఆశయంతో ఈ ట్రిపుల్ ఐటీలను ప్రవేశ పెట్టారు. ఇంటర్ ఇంజనీరింగ్‌తో ఆరేళ్ల కాలపరిమితితో కూడిన ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సులను ఈ ట్రిపుల్ ఐటీల్లో అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాత్రమే ఈ ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు అందిస్తున్నారు. ఇక్కడ సీటు సంపాదిస్తే అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంజనీరింగ్ విద్యను ఈ కేంద్రాల్లో ఉచితంగా బోధిస్తున్నారు. ఈ ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీని పూర్తి చేసిన వారు మంచి ప్యాకేజీలతో మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కడప జిల్లా ఇడుపుల పాయ, కృష్ణాజిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా ఒంగోలు, శ్రీకాళం జిల్లాల్లో ఈ ట్రిపుల్ ఐటీలున్నాయి. ఈ నాలుగు కేంద్రాల్లో మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన వారికి 92.99 శాతం, ప్రైవేటు పాఠశాలల్లో చదివి బీపీఎల్‌కు దిగువన ఉన్నవారికి 7.01 సీట్లు కేటాయిస్తున్నారు. ఈ ట్రిపుల్‌ఐటీలు ప్రారంభించినప్పటి నుంచి ప్రతి ఏటా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తున్నాయి.

నక్కపల్లి మండలంలో ముగ్గురు

ఈ ఏడాది ప్రవేశాలకు సంబంధించి ఎంపికయిన విద్యార్థుల జాబితాను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. నక్కపల్లి మండలం నుంచి ఇటీవల పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో మొదటి, రెండు, మూడో స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు సాధించారు. ఈ ముగ్గురు గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వారు కావడం విశేషం. ఈ పాఠశాలలో చదివిన పైలా జగదీష్ 581/600 మార్కులతో మండల టాపర్‌గా నిలిచి, నూజివీడు క్యాంపస్‌కు ఎంపికయ్యారు. ఇతనిది డొంకాడ కొత్తూరు గ్రామం. తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. ఇదే పాఠశాల నుంచి బాలానంద పార్థు 571 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించి, శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికయ్యాడు. గొడిచర్లకు చెందిన ఈ విద్యార్థి తల్లిదండ్రులు వ్యవసాయదారులే. ఇదే గ్రామానికి చెందిన వి.ఎస్.ఆర్ సుభాష్ 567 మార్కులతో తృతీయ స్థానం సంపాదించాడు. శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికయ్యాడు.

మునగపాక: మండలంలోని ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, పాటిపల్లి మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉన్నాయి. కాగా పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా మునగపాక హైస్కూల్లో చదువుకున్న ముగ్గురు విద్యార్థినులు ఐఐఐటీలకు ఎంపికై అందరి మన్ననలు అందుకుంటున్నారు. ముగ్గురు విద్యార్థినులు ఐఐఐటీకి ఎంపిక కావడం పట్ల హైస్కూల్ హెచ్‌ఎం మట్టా శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు నాయుడు, గోపి హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు.



మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్

22 నుంచి ఐఐఐటీలకు కౌన్సెలింగ్...

2024–25 సంవత్సరానికి సంబంధించి ఐఐఐటీలో ఎంపికైన విద్యార్థుల జాబితాలను ఈ నెల 11న విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లలో 4400 సీట్లకు ఈ నెల 21 నుంచి ఐఐఐటీకి సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది. మునగపాక జెడ్పీ హైస్కూల్లో ఇటీవల జరిగిన ఇటీవలి టెన్త్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థినులు విల్లూరి యామిని, టెక్కలి జయశ్రీలు నూజివీడు ఐఐఐటీకి ఎంపికయ్యారు. బీశెట్టి గీత శ్రీకాకుళం ఐఐఐటీకి ఎంపికైంది.

కల నెరవేరింది



ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. లక్షలు ఖర్చు పెట్టి ఇంజనీరింగ్ విద్యనభ్యసించడం మా లాంటి పేదవారికి సాధ్యం కాదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఈ ట్రిపుల్ ఐటీల్లో చదువుకున్న వారు ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారని విన్నాను. నాకు కూడా అదే అవకాశం రావడం సంతోషంగా ఉంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే టెన్త్‌లో ఎక్కువ మార్కులతోపాటు, ట్రిపుల్ ఐటీలో సీటు పొందాను.

-పార్థు, శ్రీకాకుళం క్యాంపస్

రుణం తీర్చుకోలేనిది



మాలాంటి పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం మహానేత వైఎస్సార్ ట్రిపుల్ ఐటీలను ప్రవేశ పెట్టడం ఎంతో గర్వంగా ఉంది. మంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంజినీరింగ్ విద్య చదువుకునే అవకాశం రావడం గర్వంగా ఉంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయులు చూపిన ప్రత్యేక శ్రద్ధ నేను ఈ ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు సాధించేందుకు దోహదపడింది. వారి రుణం తీర్చుకోలేనిది.

-సుభాష్, శ్రీకాకుళం క్యాంపస్

ఇంజినీర్‌ను కావడమే లక్ష్యం

నేను పాయకరావుపేటలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో 10 వ తరగతి చదివాను. 593 మార్కులు వచ్చాయి. నాకు నూజివీడు ఐఐఐటీలో సీటు వచ్చింది. ఎంపీసీలో జాయిన్ అయ్యాను. మంచి ఇంజనీర్‌ను కావడమే లక్ష్యం . నా తండ్రి వీరబాబు తాపీమేస్త్రి, కాగా తల్లి నాగమణి గృహిణి. ట్రిపుల్ ఐటీలు మాలాంటి పేద విద్యార్థులకు వరంలా మారాయి.

-కె.ఎస్.డి.స్వాతి, పాయకరావుపేట

నూజివీడు క్యాంపస్‌లో సీటు సాధించా

నేను పాయకరావుపేటలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో 10 వ తరగతి చదివాను. 588 మార్కులు వచ్చాయి. నాకు నూజివీడులో ఐఐఐటీలో సీటు వచ్చింది. ఎంపీసీలో చేరాను. ఇంజినీరింగ్ చదువుతాను. తండ్రి స్వీట్ స్టాల్ లో పని చేస్తారు. తల్లి గృహిణి.

-జి.లలిత, పాయకరావుపేట

ఎంతో ఆనందంగా ఉంది



కష్టపడి చదవడం వల్లే పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించాను. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా తర్ఫీదు నిచ్చారు,. ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. మాలాంటి పేద విద్యార్థులు ఆరేళ్ల కాలపరిమితితో కూడిన ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్య అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఈ ట్రిపుల్ ఐటీలను ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రవేశం దక్కడం నిజంగా మా అదృష్టం.

-జగదీష్, నూజివీడుకు ఎంపికైన విద్యార్థి

పారిశుధ్య పనులు చకచకా



ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



క్లబ్ రోడ్డులో చెత్త కుప్పలు తొలగించిన తర్వాత పరిశుభ్రంగా ఉన్న రహదారి

- కదిలిన మున్సిపల్ యంత్రాంగం
- ముమ్మరంగా చెత్త తొలగింపు

యలమంచిలి రూరల్ : పట్టణంలో పడకేసిన పారిశుధ్యంపై ।ఎక్కడి చెత్త అక్కడే। శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనంతో మున్సిపల్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. పట్టణంలో ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తొలగించి వాటిని ట్రాక్టర్లపై డంపింగ్ యార్డుకు తరలించారు. ఇంఛార్జ్ మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకర్రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు చర్చించి సాక్షిలో ప్రచురితమైన వార్తలో ఎక్కడెక్కడ చెత్త కుప్పలు ఉన్నాయో వాటిని తక్షణమే తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు తొలగించి మురుగునీరు సాఫీగా పారేలా చూడాలని సిబ్బందికి చెప్పారు. పట్టణంలో పారిశుధ్య లోపం తలెత్తకుండా పకడ్బందీ తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధికారులను ఆదేశించారు. దీంతో పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, క్లబ్ రోడ్డుల్లో చెత్తకుప్పలు తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. రోడ్లపై చిరు వ్యాపారులు, ప్రజలు, రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. దోమల నివారణకు ప్రతి రోజూ రెండు వార్డుల్లో ఫాగింగ్ జరుగుతుందన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరం



మునగపాకలో బ్లీచింగ్ పిచికారీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. మునగపాకలో బుధవారం జరుగుతున్న బ్లీచింగ్ పిచికారీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు డయేరియా బారిన పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తాజా ఆహారంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు.

ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి



మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

తుమ్మపాల : అచ్యుతాపురం సెజ్‌లోని వసంత కెమికల్స్‌లో రియాక్టర్ పేలిన ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు ఆర్. శంకరరావు, వి.వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రమాదంలో మృతి చెందిన ఒడిశాకు చెందిన ప్రదీప్‌రౌత్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రమాదాలపై తీవ్ర నిర్లక్ష్యం నెలకొంటుందని, ఇటీవల కొత్తగా వచ్చిన కలెక్టర్ పారిశ్రామిక అధిపతులతో సమావేశం నిర్వహించిన నాలుగు రోజుల్లోనే ప్రమాదం జరిగడం దురదృష్టకరమన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల లోపం, నాసిరకం రేయాక్టర్ల వల్ల ప్రమాదాలు జరిగి వలస కార్మికులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మూడోరోజుకు ఏకాహం

మునగపాక : మునగపాక సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న ఏకాహం బుధవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా సాయిబాబా ఆలయంలో సాయి కీర్తనలు అలాగే భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు కీర్తనలు ఆలపించారు. కాగా ఈ నెల 21న గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వాహకులు బొడ్డేడ వీరేంద్ర తెలిపారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత



అప్పారావు కుటుంబానికి రూ. లక్ష చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి : పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించిన సిబ్బందికి గుర్తింపు లభిస్తుందని (పోలీస్ బ్యాచ్ 1990) శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.అనిల్ అన్నారు. తమ బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ నక్కా అప్పారావు అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు అసోసియేషన్ తరపు నుంచి రూ. లక్ష చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి ఉద్యోగి ఈ విధంగా మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ముబారక్, బోని శ్రీనివాసరావు, సుబ్బరాజు, వెంకటేశ్వర్లు, సాయి, నాయుడు, ఆనంద్, రామారావు, నరసింగరావు, కోటేశ్వరరావు, గంగాధర్, వెంకట్రావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదినం



పెనుగొల్లులో హరిభజన చేస్తున్న భక్తులు

కోటవురట్ల : మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. హైందవ సంస్కృతిలో తొలి ఏకాదశికి విశిష్టత ఉంది. ఒక ఏడాదిలో 24 ఏకాదశులు రాగా ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా జరుపుకొంటారు. ఈ సందర్భంగా హిందువులు పిండివంటలు చేసి శ్రీమహా విష్ణువుకు సమర్పించి పూజలు చేశారు. విష్ణు సహస్రనామ పారాయణాన్ని భక్తి శ్రద్ధలతో పారాయణం చేశారు. రోజంతా ఉపవాసం ఉండి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటలాడాయి. వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు.

ఎస్.రాయవరం: తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి, దార్లపూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగొల్లు, కొరుప్రోలు, సైతారుపేట గ్రామాల్లోని ఆలయాల్లో హరిభజన, ఏకాహం కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు స్వర్ణ సంపెంగలతో అర్చన

అనకాపల్లి : స్థానిక గవరపాలెం దిబ్బవీధిలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి గురువారం స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన చేయనున్నట్లు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం : స్థానిక ఉన్నత పాఠశాలలో 1990–91లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. సుమారు 70 మంది నాటి విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకుని యోగక్షేమాలు తెలుసకున్నారు. చిన్న నాటి ఆత్మీయ సంగతులు గుర్తు చేసుకున్నారు. నాడు తమకు బోధన జరిపిన గురువులను స్మరించుకున్నారు. సుమారు 33 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో పూర్వ మిత్రులంతా ఆనందంతో పులకరించారు. ఆటపాటలతో సందడి చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో ముప్పిన శ్రీను, కర్రి కోటి, దోనె రాజ్‌కుమార్, సోమిరెడ్డి మణి పాల్గొన్నారు.

మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

నక్కపల్లి : పీర్ల పండగ (మొహర్రం)ను ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పెద బోదిగల్లం, పెద దొడ్డిగల్లు, అప్పలపాయకరావుపేట, చినబోదిగల్లం, రామకృష్ణాపురం తదితర గ్రామాల్లో పీర్ల పండగ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పీర్ల పండగను పురస్కరించుకుని నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఎంపీటీసీ గొర్ల గోవిందు, సర్పంచ్ ముస్సీసా, మాజీ ఎంపీటీసీ గొనగాల రామకృష్ణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో మొహర్రం పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరికొకరు మొహర్రం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మసీదుల్లో ప్రార్థనలు చేశారు.